

రాజమహేంద్రవరంలో అంగన్‌వాడీల అరెస్ట్


టూ టౌన్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చలో విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలను రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సుమారు 100 మందిని అదుపు లోకి తీసుకుని వారిని టూ టౌన్, దిశ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ స్టేషన్ వద్ద వారు ఆందోళన చేపట్టారు. రాత్రి 9 గంటలకు విజయ వాడకు వెళ్లమని రాతపూర్వకంగా సంతకాలు తీసుకుని విడిచిపెట్టారు. ఈ అక్రమ అరెస్టులను సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ ఖండించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి

- ఉద్యోగ భద్రత కరువు
- పని దినాల లక్ష్యం చేరుకోకపోతే వేతనం నిల్
- ఆందోళనలో ఉపాధి సిబ్బంది

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కరువయ్యింది. ప్రజా ప్రతినిధులను కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు. సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశల వారీ పోరాటాలు చేస్తున్నా పాలకుల్లో స్పందన రావడం లేదు. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడంతోపాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలనే వారి డిమాండ్ నెరవేరడం లేదు. కరోనా తరువాత పరిస్థితి సాధారణ స్థితికి వచ్చి, పనులు ప్రారంభమైనా ఇప్పటికీ భరోసా కల్పించలేదు. తాజాగా పని దినాల ఆధారంగానే జీతాలు చెల్లింపు విధానాన్ని తీసుకొచ్చి వారి బతుకులను మరింతగా ఛిద్రం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 910 ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల లక్ష్యాలను చేరుకోవటంలో వెనుకబడుతూ వచ్చారు. ఈ విధంగా దశల వారీగా 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే విధానం అమలు చేస్తే రాబోయే రోజుల్లో పూర్తిగా ఉపాధికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

అందని ద్రాక్షలా లక్ష్యాలు

ఏడాదిలో గ్రామంలో 7,500 పని దినాలు కల్పించిన వారిని ఎ గ్రేడ్ కింద చేర్చి వారికి నెలకు రూ.8,900 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 7,500-6,500 మధ్య పని దినాలు కల్పించిన వారిని బి గ్రేడ్‌గా పరిగణించి రూ.7,900, రూ.350 అలవెన్సులు, 5,000 నుంచి 6,500 మధ్య పనిదినాలు కల్పించిన వారిని సి గ్రేడ్‌గా పరిగణించి రూ.6,400 వేతనం, రూ.350 అలవెన్సు ఇస్తున్నారు. 5,000 కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు లేకుండా నిర్ణయం తీసుకుంది. వీరిని సీనియర్ మేట్‌గా పరిగణిస్తారు. ఈ విధంగా జిల్లాలో 460 మందికి సీనియర్ మేట్లుగా మిగిలిపోయినట్లు తెలుస్తోంది. కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ ఫలితంగానూ, పట్టణాలు, నగర పంచాయతీల్లో కొన్ని గ్రామాలను విలీనం చేయడంతోనూ ప్రభావం పడిందని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ఎ గ్రేడ్, బి గ్రేడ్, సి గ్రేడ్ కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు.


పెరవలిలో ఎంఎల్‌ఏకు వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగడం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలకు మించి పనులు జరగడం లేదు. ఫిబ్రవరి నుంచి మే నెలలో ముమ్మరంగా జరుగుతున్నాయి. మిగతా రోజుల్లో వ్యవసాయ పనులు ఉన్నందున ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనుల్లో జనం బిజీగా ఉండటంతోనూ ఉపాధి పనులు పెద్దగా సాగడం లేదు. గతంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పేరుతో కొన్ని రోజులపాటు ఉపాధి పనుల కేటాయింపులను తాత్కాలికంగా నిలిపి వేశారు. అనంతరం పునరుద్ధరించినప్పటికీ అనేక నిబంధనలను పెట్టారు. 7,500 పనిదినాలు ఏడాదికి ఎలా కల్పిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రశ్నిస్తున్నారు.

కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి

ప్రభుత్వ నిబంధనలు తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. లక్ష్యాల విధానాన్ని రద్దు చేయాలి. కనీస వేతనం నెలకు రూ.26,000 చెల్లించాలి. నగర పంచాయతీల్లో కలిసిన గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి. 17 సంవత్సరాలుగా ఈ రంగంలో పనిచేస్తున్న వారిని సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి. పనిదినాల లక్ష్యాలను ఉపసంహరించుకోవాలి.

ఎ.రమణ, ఫీల్డ్ అసిస్టెంట్, పిట్టల వేమవరం, పెరవలి మండలం

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

సైకిల్ థాన్ ర్యాలీ ప్రారంభోత్సవంలో కలెక్టర్ పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


సైకిల్ థాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరాన్ని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, సమిష్టి బాధ్యతతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. 'స్వచ్ఛతాహి 'సేవ', ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వై జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకు ఆదివారం సైకిల్ థాన్ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా సమిష్టి భాగస్వామ్యంతో గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రతగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా పచ్చని వాతావరణంలో ఉంచేందుకు ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు ప్రతి పౌరుడు సమిష్ట బాధ్యతతో గ్రామ, పట్టణాల్లో కాలుష్యరహిత ఉండేందుకు కృషి చేయాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ "స్వచ్ఛతాహి సేవ", ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు, నగర ప్రజలకు అభినందనలు తెలిపారు. స్వచ్ఛతాహి సేవ, ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 సంబంధించి నగరంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వచ్చే శుక్రవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మెగా ఐఎస్ఎల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్, ఎంహెచ్ఒ డాక్టర్ ఎ. వినూత్న, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


కొరటాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా పోరాటాల వారధి, కార్మిక నాయకుడు కొరటాల సత్యనారాయణను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని పేపర్ మిల్లు సిఐటియు కార్యాలయంలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో కొరటాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి బి పవన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి రాజులోవ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే కొరటాల సత్యనారాయణ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని, తెలంగాణ సాయుధ పోరాటంలో నాయకత్వం వహించారని, వ్యవసాయ కార్మికుల కూలి పెంపు పోరాటాలు, కార్మిక సంఘాల ఏర్పాటు చేసి కార్మిక హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయన్నారు. మతసామరస్యానికి విఘాతం కలిగిస్తున్న తీరును తిప్పికొడుతూప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో సిపిఎం నాయకులు బి.పూర్ణంరాజు, సిఐటియు నాయకులు లవ కుమార్, సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

తుప్పలను తొలగించిన విద్యుత్ శాఖ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



ఎట్టకేలకు విద్యుత్ స్తంభం, తీగలపై అల్లుకుపోయిన పిచ్చి మొక్కల పొదులను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. జిటిపిఎస్ క్వార్టర్స్ మరియు వాటర్ ట్యాంకు వద్ద ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం, లైన్‌కు పిచ్చిమొక్కల తీగలు పాకి కిందకు వేలాడుతున్న నేపథ్యంలో ప్రజల ఆందోళనను గమనించి 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రిక నిన్నటి రోజున వెలుగులోకి తెచ్చింది. దీనిపై ఇరిగేషన్ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించి ఆదివారం ఉదయం విద్యుత్ స్తంభం, వాటర్ ట్యాంకుకు పాకిన తుప్పలను నరికివేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అంగన్‌వాడీల అక్రమ నిర్బంధాన్ని ఆపాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అంగన్‌వాడీల అక్రమ నిర్బంధాన్ని ఆపాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, టి.మధు, నగర కార్యదర్శులు బి.పవనఖ్, వి.కొండలరావులు ఓ ప్రకటనను విడుదల చేశారు. అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి 25వ తేదీ తలపెట్టిన ధర్నాను విఫలం చేయడానికి ప్రభుత్వం పోలీసుల ద్వారా నిర్బంధానికి గురిచేయడం, అరెస్టులకు పాల్పడటం దారుణమన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనేక రూపాల్లో ఆందోళనలు చేసిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియచేసేందుకు సిద్ధమైన అంగన్‌వాడీలను నిర్బంధించడం తగదన్నారు. తక్షణమే అరెస్టు చేసిన అంగన్‌వాడీలను విడుదల చేయాలని, నేడు జరిగే విజయవాడ ధర్నాకు అనుమతినివ్వాలని వారు డిమాండ్ చేశారు.

అన్నదమ్ముల్లా కలిసి ఐక్యంగా పోరాడుదాం


బ్రాహ్మణితో భేటీ అయిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చుతున్న జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు టిడిపి, జనసేన పార్టీలు అన్నదమ్ముల్లా కలిసి పోరాడాలని నారా బ్రాహ్మణి అన్నారు. నారా లోకేష్ విడిది కేంద్రంలో ఆదివారం బ్రాహ్మణిని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ నేతృత్వంలో జిల్లాలోని పలు నియోజక వర్గాలకు చెందిన జనసేన పార్టీ ఇన్‌ఛార్జులు, ముఖ్య నాయకులు ఆదివారం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రాష్ట్రంలో పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని, జగన్ రెడ్డి రాక్షస పాలనపై ఉమ్మడి పోరాటం చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ, ఎవ రూ చూడలేదని అన్నారు. చంద్రబాబుపై కేసు విషయంలో అన్ని డాక్యుమెంట్లు, రిపోర్టులు తాను పరిశీలించానని....చంద్రబాబు తప్పు చేసి నట్లు చిన్న ఆధారం కూడా ఎక్కడా లేదని అన్నారు. రాజకీయ కక్ష తప్ప ఈ కేసు మరొకటి కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ స్థాయి విద్వేష రాజకీయాలు ఎప్పుడూ లేవని బ్రాహ్మణి ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు కం రైలు వంతెనపై రాకపోకల నిషేధం

- 27 నుంచి అక్టోబర్ 26 వరకూ మరమ్మతులు
- రూ.2.10 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉభయ గోదావరి జిల్లాల ప్రధాన వారధి రోడ్డు కం రైలు వంతెనపై రాకపోకలను నిషేధిస్తూ అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 26 వరకూ ఎటువంటి వాహనాలను అనుమతి లేకుండా మరమ్మత్తులు చేపట్టనున్నారు. ఈ మరమ్మత్తుల కోసం రూ.2.10 కోట్లను కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం వెల్లడించారు. అమరావతి నుంచి అరసవిల్లికి రైతులు చేపట్టిన పాదయాత్ర గత ఏడాది అక్టోబర్‌లో కొవ్వూరు నుంచి రోడ్డు కం రైలు వంతెన మీదుగా రాజమహేంద్రవరం నగరంలోకి అడుగుపెట్టేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. అదే సమయంలో రోడ్డు కం రైలు వంతెనపై మరమ్మత్తుల పేరుతో



పది రోజులపాటు రాకపోకలను నిలుపుదల చేశారు కేవలం అమరావతి రైతుల పాదయాత్రను రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి రాకుండా చేసేందుకే మరమ్మత్తుల పేరుతో రాకపోకలను నిషేధించారనే ఆరోపణలను జిల్లా అధికార యంత్రాంగం ఎదుర్కొంది. నాడు వచ్చిన ఆరోపణలకు అనుగుణంగానే రోడ్డు కం రైలు బ్రిడ్జిపై తూతూమంత్రంగా పనులు చేపట్టి మమా అనిపించారనే విమర్శలు లేకపోలేదు. ప్రస్తుతం సెంట్రల్ క్యారేజ్‌వేకి మరమ్మతులు మరియు వయాడక్ట్ భాగం మరియు అప్రోచ్‌లతో సహా దెబ్బతిన్న సెకండరీ జాయింట్లు మరమ్మత్తులు చేపట్టనున్నట్లు కలెక్టర్ మాధవీలత ప్రకటించారు. ఈ బ్రిడ్జిపై మరమ్మత్తులు చేపట్టేందుకు ఆర్ అండ్ బి అధికారుల సూచనతో పూర్తిగా ట్రాఫిక్‌ను మళ్లింపు చేయాల్సివస్తుందని వివరించారు. 'రోడ్ కం రైల్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టడానికి వయాడక్ట్ భాగం మరియు అప్రోచ్‌లతో సహా బిటి క్యారేజ్‌వే పునరుద్ధరణ 0.00 కి. మీ.ల నుంచి 4.473 కి.మీ.ల పొడవు దెబ్బతిన్న సెకండరీ జాయింట్ల వద్ద జియో గ్లాస్ గ్రిడ్‌లకు చెందిన ప్రత్యేక మరమ్మత్తులు చేపడతారని తెలిపారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జరుగుతున్న రిలే నిరహారదీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్టు చేయించిందని పలువురు నేతలు ధ్వజమెత్తారు. **రాజమహేంద్రవరం** కోరుకొండ రోడ్డులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. 13వ రోజు జరిగిన ఈ దీక్షల్లో నగర బిసి సెల్, ట్రేడర్స్ సెల్ సభ్యులు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు నగర కమిటీ అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** టిడిపి ఎస్‌సి మాదిగ సామాజిక వర్గం మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు నాయకత్వంలో ఆదివారం వేలివెన్ను నుంచి గౌరీపట్నం వరకు పాదయాత్ర నిర్వహించారు. రాజానగరం మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలో బాబుతో మేము సైతం అంటూ టిడిపి శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజానగరం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ఈ ర్యాలీలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత అధ్యక్షుడు కందుల బాబురాయుడు, మాజీ జడ్‌పిటిసి కొల్లం రత్నం, మాజీ ఎంపిపి బత్తుల త్రిమూర్తులు, మాజీ వైస్ ఎంపిపి వంకా మల్లిబాబు, పార్టీ నాయకులు బచ్చు ప్రసాద్, చోడశాని త్రిమూర్తులు, తోటకూర నాగేశ్వరరావు, దాసరి శ్రీను, మాజీ సర్పంచులు మదిరెడ్డి చినవెంకట్రావు, నాతిపా జాన్, సోడసాని రామారావు, చరమశెట్టి వెంకటరావు, నారగని బంగారియయ, మాదబోయిన వెంకట రమణ, కోట గోవింద్, తేజ, దవన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


రాజానగరంలో కాగడాల ప్రదర్శనలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - పెరవలి

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్(సిఐటియు) నాయకులు ఎంఎల్ఎ .జి.శ్రీనివాస నాయుడును కోరారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు ఎంఎల్‌ఎను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు, మాన్ డేస్ టార్గెట్ విధానం రద్దు చేసి అందరికి ఎఫ్‌టిసి అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామీణ ఉపాధి పథకంలో గత 17 సంవత్సరాలు గా ఫీల్డ్ అసిస్టెంట్లుగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉపాధి హామీ కూలీలకు ఉపాధి పని దినాలు కల్పిస్తూ దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారని అన్నారు. అయినా ఫీల్డ్ అసిస్టెంట్స్ డిమాండ్స్‌ను ప్రభుత్వం పటించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి .నరేష్, దొంగ సత్యనారాయణ, విజయలక్ష్మి, బాబురావు, రాంబాబు, గణపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేర దుషించిన టీచర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

విద్యార్థులను కులం పేరుతో దూషించిన టీచర్‌ను సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చాగల్లులోని ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న ఆమె విద్యార్థులను దుర్భాషలాడటం, ముఖ్యంగా ఎస్‌సి విద్యార్థులను కులం పేరుతో అసభ్యంగా మాట్లాడటాన్ని దళిత సంఘాల నాయకులు నల్లి రమేష్, బయ్యే మునీంద్ర, చల్లబత్తుల సత్యనారాయణలు తప్పుపట్టారు. విద్యార్థులకు మంచి విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయురాలు ఈవిధంగా విద్యార్థులను కులం పేరుతో దూషించడం సరికాదన్నారు. ఆ టీచర్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి శిక్షించాలని, శాశ్వతంగా ఆమెను ఉపాధ్యాయ వృత్తి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత టీచర్‌పై త్వరలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఒహెచ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెరవలి

కానూరుఅగ్రహారంలో జల జీవన్ మిషన్ పథకంలో రూ.73.00 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు, పైపులైన్‌కు ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నూతన సచివాలయం భవన నిర్మాణం చేయడం జరిగిందని, జగనన్న ఇళు ,, రైతు భరోసా కేంద్రంతోపాటు, ఆసరా, విద్యా దీవెన, వద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసం వెంకన్న, ఎంపిపి కె. సీతారాం ప్రసాద్, జడ్‌పిటిసి కొమ్మిశెట్టి రామాంజాని, వీరమల్లు సత్యనారాయణ, కరుటూరి గోపి, అంబటి లక్ష్మీ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్ఏ తలారి పుట్టినరోజు

ప్రజాశక్తి - దేవరపల్లి

ఎంఎల్ఎ తలారి వెంకట్రావు 58వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయన క్యాంపు కార్యాలయంలో జంగారెడ్డిగూడెం శ్రీ సూర్య బ్లడ్ బ్యాంక్ యాజమాన్యం చే మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఆయన పుట్టిన రోజు కానుకగా పాత్రికేయులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడియం

యుటిఎఫ్ 50వ వసంతోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాలకు, స్వర్ణోత్సవ సంబరాల గోడ పత్రిక ప్రచారాన్ని ఆదివారం యుటిఎఫ్ ప్రతినిధులు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి ఈవివిఎస్ఆర్ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలుకూరి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు జివివి ఆనంద్ కుమార్, కార్యదర్శి అబ్బాయి తదితరులు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాల తనిఖీ

దేవరపల్లి : స్కిల్ డెవలప్మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నారా భువనేశ్వర్‌కి మద్దతు తెలపడానికి హైదరబాద్ నుంచి ఐటీ ఉద్యోగులు వస్తున్నారని సమాచారంతో పోలీసులు గోపాలపురం, దేవరపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఐటీ ఉద్యోగులు హైదరాబాద్ నుంచి కార్లలో భారీగా వస్తున్న సమాచారం రావడంతో ఆదివారం పోలీసులు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో దేవరపల్లి సిఐ అనుసూరి శ్రీనివాసరావు, ఎస్ఐలు శ్రీహరి, సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అది మనవాళ్లకేనిరా..
కార్పొరేట్లకు కాదు..!!

నన్నయలో నూతన కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

నన్నయ యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకంగా ఎంఎస్‌సి ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ప్రారంభిస్తున్నామని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్సిటీలో ఎంఎస్‌సి ఫుడ్ అండ్ టెక్నాలజీ కోర్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో మ్యాన్‌పవర్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దష్టిలో ఉంచుకుని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీకల్ రిసెర్చ్ ఇన్సిట్యూట్(సి.ఎఫ్.టి.ఆర్.ఐ), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రిసెర్చ్ (సి.ఎస్.ఐ.ఆర్) మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మైసూర్ సౌజన్యంతో నన్నయ యూనివర్సిటీలో ఈ కోర్సును ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎపి పిజి సెట్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న కౌన్సిలింగ్‌లో ఎంపిక చేసుకుని కోర్సులో చేరవచ్చన్నారు. ఎంఎస్‌సి ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులో చేరేందుకు బిఎస్‌సిలో ఫుడ్ టెక్నాలజీ, ఒకేషనల్ ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, హోమ్ సైన్స్, అప్లైడ్ న్యూట్రిషన్, రూరల్ హోమ్ సైన్స్, క్లినిక్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఫుడ్ సైన్స్ మరియు క్వాలిటీ కంట్రోల్ మరియు న్యూట్రిషన్‌ను ఒక పేపర్‌గా ఉండి గ్రూప్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కేవలం 20 సీట్ల పరిమితితో ఈ కోర్సును అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, కె.వి.రావు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ కె.రమణేశ్వరి, డాక్టర్ ఎ.మట్టారెడ్డి, డాక్టర్ బి.జగన్మోహనరెడ్డి, డాక్టర్ కె.దీప్తి పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విసి పద్మరాజు

ఇదేం చెత్త తొలగింపు?


రోడ్డు పక్కన చెత్తను కాలువలోకి నెట్టేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కడియం

మండలంలోని పలు గ్రామాల్లో సేకరించిన చెత్తను వాహనాలలో తరలించి, కాలువ గట్టుల పైన, రోడ్డులకు ఇరువైపులా డంప్ చేస్తున్నారు. పేరుకుపోయిన చెత్తకు నిప్పు పెట్టడం, అనంతరం చెత్త తొలగింపు పేరుతో అక్కడికక్కడే తాత్కాలికంగా సర్దుబాటు చేసి చేతులు దులుపుకోవడం అధికారులకు పరిపాటిగా మారింది. వేల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి త్రాగునీరు అందించే గోదావరి తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువను చెత్తతో కలుషితం చేస్తున్నారు. మండలంలోని వేమగిరి, కడియం, కడియపు సావరం గ్రామాలు ఈ విషయంలో తరచు పోటీ పడుతున్నాయి. ఈ విషయంపై ప్రజలు, రైతులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదు. ఈ సమస్యపై ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు స్పందించి, రోడ్లు, కాలువల మార్జిన్లను, ప్రభుత్వ ఖాళీ స్థలాలను చెత్తతో నింపే కార్యక్రమానికి స్వస్తిపలకాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

అదృశ్యమైన బాలిక మరణం

ప్రజాశక్తి - పెద్దాపురం



పవీణ కుమారి (ఫైల్ ఫొటో)

ఐదు రోజుల క్రితం అదృశ్యమైన బాలిక ఆదివారం సాయంత్రం కట్టమూరు గ్రామ శివారులో శవమై కనిపించింది. స్థానిక ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన జ్యోతి అనే మహిళ 5వ తరగతి చదువుతున్న తన కుమార్తె ప్రవీణ కుమారి(10) కనిపించడం లేదని 5 రోజుల క్రితం పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం పెద్దాపురం మండలం కట్టమూరు శివారులో కుళ్లిపోయిన స్థితిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆమె ఒంటిపై ఉన్న దుస్తులను బట్టి ప్రవీణ కుమారిగా గుర్తించారు. వెంటనే సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ బి సురేష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి విచారణ ప్రారంభించారు. సమీప బంధువే ఈ హత్యకు పాల్పడి ఉండవచ్చని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు వెల్లడించారు. .

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -ఏలేశ్వరం

ఎవరికి ఎటువంటి అనుమానం రాకుండా చేపల తొట్టిలో 25 లీటర్ల నాటు సారాను మోటార్ సైకిల్ పై తరలిస్తున్న వ్యక్తిని ఏలేశ్వరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ జి సతీష్ మీడియాకు వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఏలేశ్వరం శివారు ఆర్ అండ్ బి రహదారిపై ఆదివారం తనిఖీలు చేస్తుండగా అడ్డతీగల మండలం కోనలోవ గ్రామం నుంచి చేపల తొట్టిలో రహస్యంగా సారా తీసుకొస్తున్న సొంటెపు శ్రీనును అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందుతుడిని సోమవారం ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ఉండూరు గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంతో ఆదివారం సాయంత్రం ద్రాక్షారామ పోలీసులు దాడి చేసి అయిదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, నాలుగు మోటారు సైకిల్లు, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ద్రాక్షరామ ఎస్ఐ.బి వినోద్ దర్యాప్తు చేస్తున్నారు.



నిమజ్జన ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి

వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోవాలి: ఎస్‌పి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనం చేసే కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ సూచించారు. ఉప్పాడ సముద్ర తీర ప్రాంతంలో వినాయక నిమజ్జనం చేసే ప్రాంతాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో కాకినాడ, పెద్దాపురం పోలీస్ డివిజన్లో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు, ఏడవ రోజు జరుగుతున్న శోభ యాత్రలు, వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సముద్ర తీర ప్రాంతంలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో కాకినాడ రూరల్, పిఠాపురం సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక తరవాణిపేటలోని వరసిద్ధి వినాయకస్వామి మందిరములో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సరస్వతీ పూజా కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, 4వ వార్డు కౌన్సిలర్ గుండు రామ తులసి, వాదా ప్రసాదరావు, వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు గుండు వీర తాతరాజు, సిరంగు ఈశ్వరరావు, గ్రంధి బుల్లిబాబు, జాయన సాయి సత్యనారాయణ, కోడూరి శ్రీనివాస్, ఆరేటి మహేష్, నాగవరపు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి దుర్గంధం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలో ఆదివారం కురిసిన వర్షానికి అనేక రహదారుల్లో పేరుకుపోయిన మురుగు వర్షపు నీటితో మిళితమై రహదారులను దుర్గంధంగా మార్చి వేశాయి. అనేక ప్రాంతాల్లో డ్రైన్లలో పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు డ్రైనేజీలో కలిసి రోడ్లపై ప్రవహిస్తోంది. స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్ నుంచి ప్లీడర్ల వీధి, పాల అప్పారావు సెంటర్ నుంచి మహారాణి సత్రం వీధి ఆదివారం కురిసిన వర్షపు నీటిలో మురుగు మిళితమై దుర్గంధంగా మారిపోయాయి. ఈ రహదారిలో వెళ్లాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యాన పరిశ్రమకు ప్రోత్సాహకాలు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి బివి.రమణ





ప్రజాశక్తి-అమలాపురం

తమ శాఖ ద్వారా ప్రభుత్వం ఉద్యాన పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని జిల్లా ఉద్యాన అధికారి బి.వి రమణ తెలిపారు. అందిస్తున్న రాయితీలను రైతులు బాగా ఉపయోగించుకోవడంతో పాటు అధిక ఆదాయం ఆర్జించే పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఉప ఉత్పత్తులు తయారు చేసుకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఆయన 'ప్రజాశక్తి' ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలను వెల్లడించారు.

జిల్లాలో ఏయే ఉద్యాన పంటలు,ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి.

ఎక్కువగా కొబ్బరి, అరటి, ఆయిల్ పామ్, మామిడి, కాయగూరలు, పూలు, పసుపు, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,23,000 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇందులో సుమారు 96 వేల ఎకరాల్లో కొబ్బరి, 9 వేల ఐదు వందల ఎకరాల్లో అరటి, సుమారు 4 వేల ఐదు వందల ఎకరాల్లో కాయగూరలు, మిగిలిన విస్తీర్ణంలో ఆయిల్ పామ్, కోకో, బొప్పాయి, కంద, పసుపు, వక్కా, తమలపాకు తదితర పంటలు సాగవుతున్నాయి.

శీతల గిడ్డంగుల నిర్మాణానికి రాయితీలు ఇస్తున్నారా.

రైతులకు,రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 30 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల శీతల గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 లక్షల యూనిట్ విలువలో రూ.11.25 లక్షలు వరకూ రాయితీ ఇస్తుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. ఈ యూనిట్లను నెలకొల్పుకునే రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలి.

ఆహార పదార్థాల శుద్ధీకరణ యూనిట్లకు ఎటువంటి రాయితీలు ఇస్తున్నారు.

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆహార పదార్థాల శుద్ధికరణ యూనిట్ల కోసం రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. రూ.30 లక్షల యూనిట్ విలువకు ప్రభుత్వం గరిష్టంగా 35 శాతం రాయితీలను ఇస్తుంది. అలాగే యూనిట్ విలువలో 90 శాతం బ్యాంకు రుణాలు కూడా ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం.

సమీకత ఉద్యాన పంటల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

సమీకత ఉద్యాన పంటల అభివద్ధి పథకంలో భాగంగా మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ లను ప్రభుత్వం అందజేస్తుంది. రూ.25 లక్షలు యూనిట్ విలువ ఉంటుంది. కొబ్బరి విలువ అధారిత పరిశ్రమలు, కొబ్బరి పీచు పరిశ్రమలు ఈ పథకంలో భాగంగా నెలకొల్పుకునే అవకాశం ఉంది.ఇందులో భాగంగా ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. జిల్లాలో 5 యూనిట్ల మంజూరుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఎస్సీ లబ్ధిదారులు కూడా అవకాశం ఉంది.

ఆధునిక సాగు పద్ధతులను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారు.

ఆధునిక సాగు పద్ధతుల్లో భాగంగా ఉద్యాన శాఖ షెడ్ నెట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. 35 శాతం సబ్సిడీతో పూలు, కూరగాయలు వంటివి సాగు చేసుకోవచ్చు.

ఇ-పంట నమోదు తప్పనిసరి అంటున్నారు నిజమేనా.

రైతుల పంటలకు ఇన్ ఫుట్ సబ్సిడీ రావాలన్నా, ఇన్సూరెన్స్ పొందాలన్నా, బ్యాంకుల నుంచి రుణాలు కావాలన్నా ఇలా ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందాలన్నా ఇ-పంట నమోదు తప్పనిసరి.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

కొబ్బరి ఆధారిత కుటీర పరిశ్రమల నెలకొల్పుకునేందుకు ప్రభుత్వం విరివిగా రాయితీలు ఇస్తోంది. కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ద్వారా వ్యక్తులు, రైతులు, సంఘాలకు 35-50 శాతం రాయితీపై యూనిట్ లను పెట్టుకునే అవకాశం ఉంది.

అంతర పంటల వల్ల ఉపయోగం ఏమిటి.

రైతులు అదనపు ఆదాయం పొందుటకు కొబ్బరి, ఆయిల్ ఫాం తదితర పంటలలో కురగాయలు, అల్లం, పసుపు, కంద, కోకో వంటి పంటలను వేసుకోవచ్చు. వీటిని ఉద్యానశాఖ తరుపున రాయితీలో అందిస్తున్నాం.

యానాం వార్తలు

ఇడబ్ల్యూఎస్‌పై ప్రజా చర్చా వేదిక

ప్రజాశక్తి - యానాం

విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్స్‌పై ఆదివారం సాయంత్రం ప్రజా చర్చావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు అధ్వర్యంలో జరిగిన ఈ చర్చావేదిక యత్రా గార్డెన్లో పార్వతీశ్వరమ్మ మినీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ 2019లో కేంద్ర ప్రభుత్వం, ఉన్నతమైన న్యాయస్థానం ఇచ్చిన జిఒ ఎకనామికల్లి వికర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్స్‌పై తన దృష్టికి తీసుకొచ్చిన పలు ఫిర్యాదుల మేరకు ఈ చర్చ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ ప్రతిఫలాలు అందకుండా ధనికులకు అందుతున్నాయని, రిజర్వేషన్లు పక్కదారి పడుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా బిసి సంఘాల నాయకుడు గుత్తుల గోవింద జయ రామారావు, మంచాల సత్య సాయికుమార్, పెండెం సూర్య ప్రకాష్, గిడ్ల చంద్రావు, దవులూరి పతి, హనుమంతరావు, లంక బంగారం, రమేష్ తదితరులు మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్స్‌లోని స్థానిక, స్థానికేతర అనే పదం వల్ల ఈ కులాలకు స్థానిక రిజర్వేషన్లు అందడం లేదన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు జరుగుతున్న విధానంలో జరుగుతున్న అవకతవకలపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం రానున్న రోజుల్లో అందరికీ రిజర్వేషన్ ఫలితాలు అందే విధంగా చర్యలు చేపట్టే విధంగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర కార్తీక్, మల్లాడి శామ్యూల్, చీకట్ల సత్యనారాయణ, డేవిడ్, కాపగంటి సూర్యనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

108 కేజీల లడ్డూ బహూకరణ


ప్రజాశక్తి - యానాం

కనకాలపేట రామాలయం సెంటర్లో ఏర్పాటుచేసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి స్థానిక నాయకులు మచ్చా శ్రీను 108 కేజీలు లడ్డూ ప్రసాదాన్ని సమర్పించారు. ముందుగా స్వామివారి లడ్డూను మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అర్చకులు కోణంబట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేసి స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు మచ్చా శ్రీనును ఘనంగా సత్కరించారు. శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు కవల బాబులు, కోన సూరిబాబు, కోన కొండబాబు, జక్కపు బ్రహ్మయ్య, కోన నాగేష్, గొర్రెల రాజేష్, కోన సత్తియ్య, కోన దేవ, కమిటి ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

28న మిలాద్ ఉన్ నబీ సెలవు

ప్రజాశక్తి - యానాం

మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్-ఉన్-నబీ పబ్లిక్ హాలీడే సందర్భ:గా ఈ నెల 28న సెలవు ప్రకటించినట్లు పుదుచ్చేరి శాఖ కార్యదర్శి ఎంవి హీరాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యానాంలో పుదుచ్చేరి ప్రభుత్వ అండర్ టేకింగ్స్, బోర్డులు, అన్ని బ్యాంకులు, కోపరేటివ్ బ్యాంకులకు సెలవును ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

లాభాల బాటలో ఆర్యాపురం బ్యాంకు: ఎంపి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

'ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు' లాభాల బాటలో పయనించడంసంతోషకరమని ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం బ్యాంకు 104వ మహాజన సభ నగరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళా శాల ప్రాంగణంలో బ్యాంక్ ఛైర్‌పర్సన్ గిరజాల రామకష్ణ తులసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ కో-ఆపరేటివ్ బ్యాంకుకు లక్ష మంది సభ్యత్వం ఉండటం అంటే..105 సంవత్సరాల చరిత్ర గల బ్యాంకు సేవలపై ఖాతాదారుల విశ్వాసం, అభిమానం స్పష్టమవుతోందన్నారు. బహుశా దేశంలోనే ఇంత పెద్ద సభ్యత్వం గల కో-ఆపరేటివ్ బ్యాంకు ఉండకపోవచ్చునని అన్నారు. రూ.వందల కోట్ల టర్నోవర్‌తో ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందిస్తున్న ఈ బ్యాంకు త్వర లోనే ఏ గ్రేడ్ స్థాయికి చేరగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొత్త డిపాజిట్ల సేకరణ, ఖాతాదారుల సంఖ్యను పెంచడం, అవసరమైన వారికి నిబంధనలు మేరకు రుణాలు ఇచ్చి అవి ఖచ్చితంగా వసూలు చేస్తూ మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన అవ సరం పాలకవర్గంపై ఉందన్నారు. ఏ ఆశయంతో అయితే ఈ బ్యాంకును దివం గత సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాద్ స్థాపించారో ఆయన ఆశయ సాధన దిశగా పాలకవర్గం, అధికారులు కృషి చేయాలన్నారు. మహాజన సభకు విచ్చేసిన సభ్యులకు బ్యాంకు సమకూర్చిన గిఫ్టలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ కొండేటి స్వరాజ్య లక్ష్మి, వైసిపి అర్బన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

వైసిపికి బాబ్జీరావు రాజీనామా

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గంలో వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న దివిలి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నరాలశెట్టి బాబ్జి రావు ఆదివారం వైసిపి పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబుకు, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు మిథున్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్‌కు పంపుతున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. గత కొంతకాలంగా పార్టీలో తనకు తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతో అసంతృప్తికి లోనై రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎస్‌కెఆర్ విద్యార్థి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎస్‌కెవిటి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని రెబాఅనిలా బాక్సింగ్ పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యిందని కళాశాల పిడి వై.సుధారాణి తెలిపారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాఘవకుమారి విద్యార్థినిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనపర్చి నేషనల్ స్థాయికి వెళ్లి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెఎస్ రత్నకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిమను కనపర్చిన విద్యార్థినిని ఆర్‌జెడి డాక్టర్ సిహెచ్ కష్ణ అభినందించారు.



ఎఎంసి ఛైర్మన్ కుడిపూడిని సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

శివన్నారాయణకు ఘన సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణను ముమ్మిడివరం శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో శివన్నారాయణ చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. అనేక సామాజిక వర్గాలకు శివన్నారాయణ విశేష సేవలు అందించి నేడు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియోజకవర్గంలో ఉన్నత పదవిని అధిష్టించారని, రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కుడిపూడి శంకరరావు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రెడ్డి హేమ సుందరి శివన్నారాయణ, సానబోయిన మల్లికార్జునరావు, సంఘం అధ్యక్షులు దొమ్మేటి రమణకుమార్, పంపన రామకష్ణ, మట్టపర్తి లోవరాజు, రెడ్డి సతీష్, పిల్లి వీరనాగు, కడలి శ్రీనివాస్, కుటుంబరావు, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రాష్ట్ర కుర్ని కరికాల భక్త కార్పొరేషన్ డైరెక్టర్ కరేళ్ల రమేష్ బాబు ఇటీవల గొంతు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం రమేష్‌బాబును రంగాపురం ఆయన గహంలో రాష్ట్ర మంత్రి వినిపే విశ్వరూప్ పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. తుని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీను, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కుడుపూడి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలమూరోళ్ల కథల' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-ఆలమూరు



ఆవిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

పెద్దపల్లకు చెందిన యువ రచయిత గొడవర్తి శ్రీనివాస్ రచించిన "ఆలమూరోళ్ల కథలు" పుస్తక ఆవిష్కరణ హైదరాబాదులో ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ జరిగింది. పుస్తక ఆవిష్కరణ పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు సమక్షంలో జరిగింది. తెలుగు సాహిత్యంలో ఆలమూరు రచయితల పాత్ర అద్వితీయమని ఇనాక్ వ్యాఖ్యానించారు. కథా సాహిత్యంలో ఆలమూరు రచయితల పాత్ర ఎంత ఉన్నతమైనదో ఈ పుస్తకం ద్వారా తెలుస్తుందనిదర్శకులు రేలంగి నరసింహారావు వ్యాఖ్యానించారు. ఆది కార్యక్రమానికి దూరదర్శన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా పనిచేసి రిటైర్ అయిన డాక్టర్ సత్యవోలు సుందర సాయి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. సినీ నటుడు జెన్నీ, యువ కథా రచయిత కుప్పిలి సుదర్శన్, సాహితీ విమర్శకుడు కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

దళిత నేత దుర్గారావు మరణం తీరని లోటు

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి పెద్ద పేటకు చెందిన కార్మిక మరియు దళిత సంఘాల నాయకులు బడుగు దుర్గారావు మరణం తీరని లోటని మండల వైస్ ఎంపిపి బయ్యా చినబాబు పేర్కొన్నారు. దుర్గారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. జిఎంసి బాలయోగి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకులు గంగుమళ్ల శ్రీనివాస్, దళిత సంఘాల నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, సరెళ్ల సత్యనారాయణ, వైసిపి నాయకులు బొంతు రాజేంద్రప్రసాద్, మాజీ సైనికులు వడ్డి శ్రీనివాసరావు, నామాడి ఏడుకొండలు, కోరపు శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసు తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

ములగపూడిలో పర్యటించిన డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడి గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహ నాయక్ ఆదివారం పర్యటించారు ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న పిహెచ్‌సిని పరిశీలించారు అనంతరం నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. శృంగవరంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

25న సామర్లకోటలో జిల్లాస్థాయి స్పందన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఈనెల 25వ తేదీ సోమవారం సామర్లకోటలో జిల్లాస్థాయి స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందని మండల తహశీల్దార్ ఎస్ లక్ష్మీ నరస కుమారి, మున్సిపల్ కమిషనర్ జె రామారావులు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి ప్రజా సమస్యలపై ఫిర్యాదులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో సామర్లకోటలో మరోవారం స్పందన కార్యక్రమం నిర్వహించేందుకు కలెక్టర్ కృతిక శుక్లా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ స్పందన కార్యక్రమాన్ని గాంధీబొమ్మ సెంటర్‌లోని యార్లగడ్డ వెంకట సుబ్బారావు రైతు భవన్లో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.